సాక్షి ఒడిశా

బుధవారం । 27 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.12,25,102లు, బంగారం 36 గ్రాముల 650 మిల్లీగ్రాములు, వెండి 226గ్రాములు 700 మిల్లీంలగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



దొండనచో దీక్షలు ప్రారంభం

ప్రసిద్ధ చైత్రమాసం ఆరంభం కావడంతో జిల్లాలో దొండనచో దీక్షలు ప్రారంభమయ్యాయి.

- 8లో

రంజాన్‌ వేళలు

ఇఫ్తార్‌	సెహరి
బుధ	గురు
6.05	4.30

న్యూస్‌రీల్‌

అంతరించిపోతున్న అటవీ సంపద



ఆర్టీవో కార్యాలయం వెనుక టేకు చెట్లు నరికివేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో అడవులను పట్టపగలే నరికేస్తున్నా అడిగే నాథుడు కరువయ్యాడు. స్థానిక కలెక్టరేట్‌ కార్యాలయానికి కూతవేటు దూరంలో సోమవారం ఈ సంఘటన చోటు చేసుకున్నది. ఒకవైపు మొక్కలను నాటాలని జిల్లా అటవీ శాఖ పిలుపునిస్తుండగా, జిల్లాలోని రామగిరి, మోహనా సమితుల్లో అనేక టేకు చెట్లు మాఫియా చేతిలో పడి నాశనమవుతున్నాయి. అడవులు నాశనం అవ్వడంపై స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మోహనా, చంద్రగిరి రేంజ్‌ అటవీ ప్రాంతంలో ఒకప్పుడు దట్టమైన అడవులు ఉండేవి. సకాలంలో వర్షాలు కురువడంతోపాటు పాదచారులకు ఎండాకాలంలో పచ్చని చెట్ల కింద సేద తీరేవారు. ప్రస్తుతం మోహనా సమితి లఖారి అభయారణ్యంలో కూడా అడవులు అంతరించిపోవడంతో వన్యప్రాణులు పట్టణంలోకి వస్తున్నాయి. దీనిపై జిల్లా అటవీ శాఖ రేంజ్‌ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దొంగిలించిన వస్తువులు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో మాధవానంద నాయక్‌

పర్లాకిమిడి: స్థానిక జిల్లా వ్యవసాయ కార్యాలయంలో మార్చి 21వ తేదీ రాత్రి జరిగిన దొంగతనంకు సంబంధించి ఆదర్శ పోలీసుస్టేషన్‌ అధికారులు నిందితుడిని పట్టుకొని, అతని వద్ద నుంచి కంప్యూటర్‌ మానిటర్‌, ప్రింటర్‌, ఎలక్ట్రానిక్‌ కాటాను స్వాధీనం చేసుకున్నట్టు సబ్‌ డివిజనల్‌ పోలీసు అధికారి మాధవనంద నాయక్‌ తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. మార్చి 21న జిల్లా వ్యవసాయ కార్యాలయం, సీనియర్‌ అసిస్టెంట్‌ అగ్రికల్చర్‌ కార్యాలయంలో ఒక కంప్యూటర్‌ మానిటర్‌, ప్రింటర్‌, ఎలక్ట్రానిక్‌ కాటా పోయినట్టు అగ్రికల్చర్‌ అధికారి మండల సంజీవ్‌ కుమార్‌ ఆదర్శ పోలీసుస్టేషన్‌లో 22వ తేదీన ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్‌డీపీవో మాధవనంద నాయక్‌ ఈ కేసును దర్యాప్తు చేయగా పర్లాకిమిడి దండుమాలవీధికి చెందిన తలాపి సాయికిరణ్‌ పట్టుబడ్డాడు. నిందితుడు వద్ద నుంచి పోయిన కంప్యూటర్‌ మానిటర్‌, ప్రింటర్‌, ఎలక్ట్రానిక్‌ కాటాను స్వాధీనం చేసుకుని, సోమవారం కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు. మరొక దొంగ పరారీలో ఉన్నట్టు వెల్లడించారు.

ఎన్నికల పరిశీలకుల ప్రకటన



దుర్గా ప్రసాద్‌ పండ

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర ప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ రాష్ట్రంలోని 21 లోక్‌సభ స్థానాలకు సంబంధించి పరిశీలకుల జాబితాను మంగళవారం విడుదల చేసింది. దీనిలో భాగంగా కొరాపుట్‌ లోక్‌సభ స్థానం కోసం పార్టీ ఎన్నికల పరిశీలకుడిగా పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్‌ పండను నియమిస్తున్నట్లు ప్రకటించింది. అదేవిధంగా బరఘఢ్‌ స్థానం కోసం అషుతోష్‌ స్వయి, సుందర్‌ఘడ్‌ (ఎస్టీ) స్థానం కోసం ప్రతాప్‌ చంద్ర నాయక్‌, సంబల్‌పూర్‌ స్థానానికి ప్రేమ్‌ శంకర్‌ మిశ్రా, కేంఝర్‌ (ఎస్టీ) స్థానం కోసం మీనకేతన్‌ బెహర, మయూర్‌భంజ్‌కు మనోరంజన్‌ రౌత్‌, బాలేశ్వర్‌ స్థానానికి అరవింద దాస్‌, భద్రక్‌(ఎస్సీ) స్థానం కోసం సుధాంసు శేఖర్‌ జెన్న, జాజ్‌పూర్‌(ఎస్సీ) లోక్‌సభ స్థానానికి అమితాబాల ఆచార్య, డెంఖనాల్‌కు బంకనిది బెహర, బలంగీర్‌ స్థానం కోసం దిలీప్‌ నంద, కలహండి (ఎస్సీ) స్థానానికి ద్వారకా మహాపాత్రో, కటక్‌ స్థానానికి సుబ్రత్‌ మహాపాత్రో, నవరంగపూర్‌(ఎస్టీ) లోక్‌సభ స్థానం కోసం దుర్గా శంకర్‌ సాహు, కందమాల్‌కు మహాపాత్రో, కటక్‌ కోసం సుబ్రత్‌ మహాపాత్రో, కేంద్రపడ కోసం శశికాంత్‌ లెంక, జగత్సింగ్‌పూర్‌(ఎస్సీ) లోక్‌సభ స్థానం కోసం నిరంజన్‌ లెంక, పూరి కోసం బిప్లబ్‌ చౌదరి, భువనేశ్వర్‌కు మనోజ్‌ బిశ్వాల్‌, అస్కాకు పూర్ణ చంద్ర నాయక్‌, బరంపురం స్థానానికి మానస్‌ ఆచార్యలను నియమించారు.



జయపురం: హోలీ వేడుకల్లో చిన్నారులు



రాయగడ: హోలీ వేడుకల్లో వైశ్య సంఘం సభ్యులు



మల్కన్‌గిరి: హోలీ జరుపుకుంటున్న స్థానికులు



జయపురం: కార్యకర్తలతో హోలీ జరుపుకుంటున్న ఎమ్మెల్యే తారాప్రసాద్‌

రంగ్‌దే..!



కొరాపుట్‌: చందాహండిలో వేడుకల్లో ఎంపీ రమేష్‌ మజ్జి, ఎమ్మెల్యే ప్రకాష్‌ మజ్జి

రంగుల పండుగ హోలీని ఆనందంగా ప్రజలు మంగళవారం జరుపుకున్నారు. పల్లెలు.. పట్టణం అని తేడా లేకుండా తెల్లవారుజాము నుంచే యువతీ యువకులు, వృద్ధులు రంగులను చేతపట్టి వీధుల్లో సందడి చేశారు. స్నేహితులతో పాటు కనిపించిన వారిపై రంగులు జల్లుతూ హడావుడి చేశారు. యువకులు ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ హోలీ శుభాకాంక్షలు తెలుపుతూ ఆనందంగా గడిపారు.

– సాక్షి నెట్‌వర్క్‌



పర్లాకిమిడి: కోమటి వీధిలో హోలీ పండగలో మహిళలు



రాయగడ: చిన్నారులతో ఎంపీ సప్తగిరి, అతని సతీమణి పూజా తదితరులు



జయపురం: రంగులు చల్లుకుంటూ డాన్స్‌ చేస్తున్న యువత



రాయగడ: జీసీడీ వాకర్స్‌ క్లబ్‌లో హోలీ వేడుకలు



బరంపురం: తన ఇంటి ప్రాంగణంలో హోలీ జరుపుకుంటున్న ఎమ్మెల్యే విక్రమ్‌ పండా



బరంపురం: హోలీ జరుపుకుంటున్న ఎంపీ చంద్రశేఖర్‌ సాహు తదితరులు



కొరాపుట్‌: నబరంగ్‌పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంస్థలు



జయపురం: హోలీ శిబిరంలో అనుచరులతో బీజేపీ నేత హిమాంశు మహాపాత్ర



బరంపురం: హోలీ పండగ జరుపుకుంటున్న ఎన్టీఆర్‌ సేవా సమితి



పర్లాకిమిడి: ప్రజలతో కలిసి హోలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కోడూరు



బరంపురం: హోలీ పండగ జరుపుకుంటున్న మేయర్‌ సంఘమిత్ర దొళాయి తదితరులు



జయపురం: సహచరులతో బీజేపీ నేత గౌతమ సామంతరాయ్‌

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ పూజలు



సమలేశ్వరి ఆలయ ప్రాంగణంలో కుటుంబీకులతో ధర్మేంద్ర ప్రధాన్‌

భువనేశ్వర్‌: కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ 15 ఏళ్ల తర్వాత ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. ఆయన స్వస్థలం అంగుల్‌ జిల్లా తాల్చేర్‌ అయినప్పటికీ కాషాయ పార్టీకి కంచుకోటగా భావించే పశ్చిమ ఒడిశాలోని సంబల్‌పూర్‌ లోక్‌సభ నియోజకవర్గం నుంచి భారతీయ జనతా పార్టీ అతనిని పోటీకి నిలిపింది. దీంతో పూరీలోని జగన్నాథ స్వామి దేవాలయాన్ని, భువనేశ్వర్‌లోని లింగరాజు ఆలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ 2000లో రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. 2004లో బీజేపీ, బీజేడీ కూటమి అభ్యర్థిగా దేవ్‌గఢ్‌ లోక్‌సభ స్థానం నుంచి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. అయితే 2009లో బీజేపీ–బీజేడీ పొత్తు చెదిరిపోవడంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. తదుపరి రాజ్యసభకు వరుసగా 2 పర్యాయాలు ప్రాతినిధ్యం వహించారు. 2012 మరియు 2018లో వరుసగా 2 సార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. ఈ విడతల్లో ఆయన కేంద్రంలో కీలక శాఖల మంత్రిగా విజయవంతంగా బాధ్యతలు నిర్వహించారు. దీర్ఘకాలం తర్వాత రాష్ట్ర ఎన్నికల్లో ప్రత్యక్ష పోరుకు ఆయన బరిలో ఉన్నారు. ఈ విషయం ఖరారు కావడంతో రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాలను సుడిగాలి పర్యటనగా సందర్శిస్తున్నారు. మంగళవారం సంబలపూర్‌లో ప్రముఖ దేవస్థానం, ప్రాంతీయుల అధిష్టాన దేవత సమలేశ్వరి ఆలయం సందర్శించి అమ్మవారి ఆశీస్సుల కోసం కుటుంబ సమేతంగా ప్రార్థించారు. అంతకుముందు పూరీలోని శ్రీజగన్నాథ ఆలయం, భువనేశ్వర్‌ ఏకామ్ర క్షేత్రంలో లింగరాజు తదితర ప్రముఖ శైవ క్షేత్రాల్ని సందర్శించి జలాభిషేకం వంటి పూజాదుల్లో భార్యాబిడ్డలతో కలిసి పాల్గొన్నారు.



ఏకామ్ర క్షేత్రంలో జలాభిషేకం పూజలో పాల్గొన్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌



శ్రీమందిరం సింహద్వారం ఆవరణలో సాష్టాంగ ప్రణామం చేస్తున్న ధర్మేంద్ర ప్రధాన్‌

గెలుపు గుర్రాలకే అవకాశం..!

- రాష్ట్రంలో 18 లోక్‌సభ స్థానాలు ప్రకటించిన బీజేపీ
- నలుగురు సిట్టింగ్‌లకు టిక్కెట్ల నిరాకరణ
- టిక్కెట్లపై బీజేడీ, కాంగ్రెస్‌ కసరత్తు



భువనేశ్వర్‌:

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు పురస్కరించుకొని గెలుపు గుర్రాల కోసం బీజేపీ అనూహ్య నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు ఆ పార్టీ అభ్యర్థుల తొలి జాబితా వెల్లడించింది. ఈ జాబితాలో కొన్ని చోట్ల ఊహాతీత పరిణామాలు తారసపడ్డాయి. మరికొన్ని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించకుండా ఊగిసలాడించింది. బిజూ జనతా దళ్‌, కాంగ్రెసు ఇంతవరకు అభ్యర్థుల జాబితాను ప్రకటించకపోవడం గమనార్హం.

సిట్టింగ్‌ల తొలగింపు ఆంతర్యం

బీజేపీ ప్రకటించిన అభ్యర్థుల 18 మంది తొలి జాబితాలో పలువురు లోక్‌సభ సిట్టింగ్‌ అభ్యర్థులను తొలగించింది. ఈ నిర్ణయంతో 4 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో సిట్టింగ్‌ అభ్యర్థులకు తొలి జాబితాలో స్థానం దక్కలేదు. మరోవైపు లోక్‌సభలో 370 పైబడి సీట్లు సాధించాలనే దృఢ సంకల్పంతో బీజేపీ అధిష్టానం కృషి చేస్తుంది. ఈ సంకల్ప సాధనకు రాష్ట్రంలో వెల్లడైన అభ్యర్థుల తొలి జాబితా ప్రామాణికలు ఎంతవరకు దోహదపడతాయోననే చర్చ జోరందుకుంది.

ఆ నలుగురు వీరే

రాష్ట్రంలో 18 లోక్‌సభ నియోజకవర్గాలకు వెల్లడించిన అభ్యర్థుల తొలి జాబితాలో సంబల్‌పూర్‌, బర్‌గడ్‌, మయూర్‌భంజ్‌, కలహండిలో సిట్టింగులను తొలగించి కొత్త అభ్యర్థులను బీజేపీ ప్రతిపాదించింది. సంబల్‌పూర్‌ నుంచి నితీశ్‌ గంగ్‌దేవ్‌, బర్‌గఢ్‌ నుంచి సురేష్‌ పూజారి, మయూర్‌భంజ్‌ నుంచి కేంద్ర మంత్రి బిశ్వేశ్వర్‌ టుడు, కలహండి నుంచి బసంత్‌ కుమార్‌ పండా అవకాశం కోల్పోయారు. ఈ నలుగురు ఎంపీల భవితవ్యంపై ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. అలాగే తొలి జాబితాలో వీరి తొలగింపు చర్చనీయాంశమైంది. మయూర్‌భంజ్‌ నుంచి బిశ్వేశ్వర్‌ టుడు తిరిగి ఎన్నికయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు బీజేపీ అంతర్గత ఆడిట్‌ వెల్లడించింది. ప్రభుత్వ అధికారులపై దురుసు ప్రవర్తన, వివాదాస్పద ప్రకటనలు చేయడం, మంత్రిగా బలహీన దక్షత ప్రదర్శన వంటి ఆరోపణలు బలపడడంతో ఆయన అభ్యర్థిత్వం నిరాకరణకు గురైంది.

మయూర్‌బంజ్‌ ప్రతిష్టాత్మకం

మయూర్‌బంజ్‌ పార్లమెంటరీ నియోజకవర్గం జాతీయ స్థాయిలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ స్థానం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సొంత జిల్లా కావడం దీనికి కారణం. ఇక్కడ నుంచి నిష్కళంకిత అభ్యర్థిని ఎంపిక చేయడంలో పార్టీ ఆచితూచి వ్యవహరించినట్లు సమాచారం. అంతే కాకుండా ఈ జిల్లాలో పంచాయతీ, మున్సిపల్‌ ఎన్నికల్లో మంచి పనితీరు కనబరుస్తున్న రాష్ట్రంలో అధికార బిజూ జనతా దళ్‌తో గట్టిపోటీ ఎదురుకానుంది. ఈ అంశాలను పరిగణలోకి తీసుకున్న కాషాయ పార్టీ రాయిరంగపూర్‌ ఎమ్మెల్యే నవ చరణ్‌ మాఝిని బరిలోకి దింపాలని నిర్ణయించుకుంది. నిష్కళింకిత నాయకుడిగా ఎన్నికల్లో విజయం సాధించేందుకు తగిన మద్దతు లభిస్తుందని పార్టీ భావిస్తోంది. అలాగే రాయ్‌రంగపూర్‌ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా రాష్ట్రపతి కుమార్తె ఇతిశ్రీ ముర్ముని బరిలోకి దించే అవకాశం ఉంది.

మధ్యప్రదేశ్‌ ఫార్ములా

ఒకేసారి జరగనున్న పార్లమెంటు, శాసనసభ ఎన్నికల్లో బలమైన ఆధిక్యతతో విజేతగా నిలవాలనే దృక్పథంతో భారతీయ జనతా పార్టీ మధ్యప్రదేశ్‌ ఫార్ములాను అవలంభించినట్లు తెలుస్తోంది. లోక్‌సభ సిట్టింగులను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి నిలబెట్టి మధ్యప్రదేశ్‌లో వ్యూహాత్మక విజయం సాధించింది. ఈ తరహాలో రాష్ట్రంలో బసంత్‌ కుమార్‌ పండా, సురేష్‌ పూజారిని రాష్ట్ర శాసనసభకు ప్రతిపాదించవచ్చు. అంచనా మేరకు పార్టీ అధికారంలోకి వస్తే వీరివురికి కొత్త కొలువులో పీఠం కల్పించే అవకాశంపై చర్చ సాగుతోంది. ఈ అంచనా కార్యాచరణ నోచుకుంటే బ్రజరాజ్‌నగర్‌ అసెంబ్లీ స్థానంలో రాధారాణి పండా స్థానంలో సురేష్‌ పూజారి, నువాపడా శాసనసభ స్థానం నుంచి బసంత కుమార్‌ పండా పోటీ చేయవచ్చు. పదంపూర్‌ నాయకుడు ప్రదీప్‌ పురోహిత్‌ను లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి టికెట్టు కేటాయించి బర్‌గడ్‌ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి బరిలోకి దింపింది. ఆయన స్థానంలో పదంపూర్‌ శాసనసభ నియోజకవర్గం నుంచి కొత్త అభ్యర్థిని పోటీకి నిలబెట్టి జంట ఎన్నికల్లో అద్భుతం ప్రదర్శనకు బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. రాజవంశీకులతో ఓట్లుని కూడగట్టుకునేందుకు కలహండి రాజ వంశీకురాలు మాళవిక కేసరి దేవ్‌ని లోక్‌సభ స్థానం నుంచి పోటీకి నిలబెట్టింది. ఈ ప్రాంతంలో రాజవంశీకుల ప్రాబల్యం కొంత మేరకు విజయావకాశాలను మెరుగుపరిచే అవకాశం ఉంది.

సంబల్‌పూర్‌ లోక్‌సభ స్థానంలో పోటీ నువ్వానేనా అన్నట్లు సాగుతోంది. ఈ నియోజకవర్గం నుంచి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని ఎన్నికల ప్రత్యక్ష పోరుకు టికెట్టు కేటాయించింది. ఈ నియోజక వర్గం నుంచి దీటైన నాయకుని పోటీకి నిలబెట్టాలని అధికార బిజూ జనతా దళ్‌ లోతుగా ఆలోచిస్తుంది. అభ్యర్థుల ఖరారు, టికెట్ల కేటాయింపు ప్రక్రియలో బీజేపీ శైలి తాజా ఎన్నికల రణరంగంలో ఎంతవరకు జయప్రదం అవుతుందో వేచి చూడాల్సిందే.

యువ సాధన శిబిరం



శిబిరంలో పాల్గొన్న యువతీ, యువకులు

జయపురం: సబ్‌ డివిజన్‌ పరిధి బొరిగుమ్మలోని సత్యసాయి మందిర ప్రాంగణంలో కొరాపుట్‌ జిల్లాస్థాయి యువ సాధన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కె.మార్కెండేయ షరాఫ్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ఐటీ ఇన్‌చార్జి ఎస్‌.కృష్ణవేణి అతిథులను యువ కో–ఆర్డినేటర్లకు పరిచయం చేశారు.

ఈ శిబిరం మార్కెండేయ షరాఫ్‌ సత్య సాయి యువ సాధకుల పాటించాల్సిన నియమాలు వివరించారు. భగవాన్‌ సత్య సాయిబాబా బోధనలు, సందేశాలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సాయి అడుగు జాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో బొరిగుమ్మ సత్యసాయి భజన మండలి కో–ఆర్డినేటర్‌ శరత్‌చంద్ర దాస్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు శ్రీముఖ సింగారం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని ముఖ అలంకరణ శ్రీముఖ సింగారం బుధవారం జరుగుతుందని ప్రకటించారు. ఈ సందర్భంగా భక్తులు, యాత్రికులకు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు తెలిపారు. బుధవారం ద్వితీయ భోగ మండప సేవ తర్వాత ఈ సేవ చేపడతారు. సుమారు 4 గంటలపాటు రత్న వేదికపై ఆశీనులైన మూల విరాటులకు శ్రీముఖ అలంకరణ చేస్తారు. ఈ వ్యవధిలో బుధవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు సర్వ దర్శనం నిలిపివేస్తారు.

భీమారావుకు అవార్డు



అవార్డు అందుకుంటున్న భీమారావు

భువనేశ్వర్: పారిశ్రామిక రంగంలో ఖనిజ వనరుల వినియోగం, ప్రయోగంపై సమగ్ర వివరణతో కూడిన ప్రచురణకు గుర్తింపుగా రఘుపాత్రుని భీమారావుకు స్థానిక బిజూ పట్నాయక్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ (బీపీయూటీ) ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూషన్ అవార్డు ప్రదానం చేసింది. బీపీయూటీ వీసీ ప్రొఫెసరు అమియ కుమార్ రథ్ ఈ అవార్డుని అందజేశారు.

ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు రేపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ ఈనెల 28న ఉదయం 8 గంటల నుంచి ఆలయ అనివెట్టి మండపంలో నిర్వహిస్తున్నట్లుగా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆలయ అధికార సిబ్బంది, అర్చకులు ధర్మకర్తల సమక్షంలో హుండీలను తెరిపించనున్నామని, నిబంధనల ప్రకారం లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎస్ఈబీ పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని ఎగువబగడ గ్రామంలో మంగళవారం రెండు సారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. పలాస, టెక్కలి ఎస్ఈబీ అధికారులు, డీటీఎఫ్, శ్రీకాకుళం ఇంటెలిజెన్స్ సిబ్బంది సమష్టిగా నిర్వహించిన దాడుల్లో 4400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. అలాగే 120 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు.

చెవిటమ్మ తల్లి ఆలయంలో చోరీ



చోరీకి గురైన చెవిటమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహం

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో గల శ్రీ చెవిటమ్మ తల్లి ఆలయంలో సోమవారం రాత్రి సుమారు రూ.2లక్షల విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెవిటమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహం మెడలో ఉన్న శతమానం, కాసులు, పుస్తులు తులమున్నర బంగారం, 7 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ ఆలయం గ్రామం మధ్యలో ఉండటంతో ఎప్పుడూ తాళాలు వేయరు. ఆ గ్రామానికి చెందిన సారవకోట కృష్ణవేణి ప్రతి రోజు ఆలయాన్ని కడుగుతుండేవారు. అదేవిధంగా మంగళవారం ఉదయం కూడా ఆమె ఆలయ ఆవరణ కడిగి అనంతరం గుడి తలుపులు తీసి చూడగా అమ్మవారి విగ్రహం మెడలో ఉన్న బంగారు, వెండి వస్తువులు లేకపోవడాన్ని గుర్తించారు. దీని పై గ్రామస్తులకు తెలియజేయగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు పోలీసులకు సమాచారం అందించారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేశారు. అలాగే అలుదు గ్రామానికి సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి మందిరంలో కూడా ఆదివారం రాత్రి గంట, ఇత్తడి పళ్లెం చోరీకి గురైనట్లు అక్కడి వారు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన

కంచిలి: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట యాదవ సామాజికవర్గానికి చెందిన నేతలు మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ధర్నా చేపట్టి నిరసన వ్యక్తంచేశారు. వివరాల్లోకి వెళితే.. కవిటి మండలం జి.బెలగాం గ్రామానికి చెందిన మద్దిలి ఈశ్వరరావు పెద్దమనిషిగా వ్యవహరిస్తున్న ఒక కేసు విషయంలో కంచిలి ఎస్ఐ జి.రాజేష్ అకారణంగా చెయ్యి చేసుకున్నారని బాధితుడితో పాటు మద్దతుదారులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ తదితరులు మంగళవారం మధ్యాహ్నం కంచిలి పోలీస్‌స్టేషన్ వచ్చారు. పోలీసులతో చర్చలు జరిపిన అనంతరం బాధితుడు ఈశ్వరరావు, ఆయన మద్దతుదారులు శాంతించారు.

తరతరణి ఉత్సవాలు ప్రారంభం

దక్షిణ ఒడిశా ప్రజల ఆరాధ్య దైవం, రుశికుల్యా నదీతీరం పక్కన కొండపై కొలువైన తరతరణి అమ్మవారి చైత్ర మంగళవారం ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కొండపై కొలువై ఉన్న తరతరిణి అమ్మవారు కాళికా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మొదటి వారం కావడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల వందలాది గ్రామల నుంచి ప్రజలు తరలివచ్చారు. పలువురు తలనీలాలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కొండ దిగువన వంటా వార్పులు చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి మధ్యాహ్నం రాజభోగం, సాయంత్రం సంధ్యా హారతి, రాత్రి బెడా చేపట్టి ప్రత్యేక రథంలో తిరువీధి నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని సౌకర్యాలు చేపట్టామని కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి తిరుముల కుమార్ రెడ్డి తెలియజేశారు. శాంతి భద్రతలు పర్యవేక్షించేందుకు ప్రత్యేక పోలీసు బలగాలు మోహరించినట్లు ఎస్పీ జగ్‌మోహన్ మీన వెల్లడించారు.

– బరంపురం



కొండపై పూజలందుకుంటున్న తరతరణి అమ్మవారు



దర్శనానికి బారులుతీరిన భక్తులు



వంటా వార్పులు చేసుకుంటున్న భక్తులు



కొండపైకి కాలి నడకన వెళ్తున్న భక్తులు



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

జయపురం టిక్కెట్టు ఎవరికో..?



గౌతమ సామంతరాయ్



హిమాంసు మహాపాత్రో



సుదాంశు శేఖర జెన



రవీంద్ర మహాపాత్రో

జయపురం: అవిభక్త కొరాపుట్ జిల్లాలో ఏకైక జనరల్ స్థానం జయపురం శాసనసభ నియోజకవర్గం. అందువలన జనరల్ నేతల దృష్టి ఈ నియోజకవర్గం పైనే ఉండడం సహజం. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో పాటు బీజేడీ, బీజేపీ మధ్య పొత్తు లేదని తేలిపోయింది. దీంతో ఈ స్థానంలో టిక్కెట్టు కోసం బీజేపీలో ఆశావాహులు పైరవీలు జరుపుతున్నారు. ముఖ్యంగా కేంద్రంలో అధికారంలో ఉండడం, దేశవ్యాప్తంగా ప్రస్తుతం మోదీ వేవ్ ఉండడంతో బీజేపీ టిక్కెట్ కోసం జోరుగా పైరవీలు జరుగుతున్నాయి. ఈ నియోజకవర్గంలో ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు నలుగురు నాయకుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన రాష్ట్ర బీజేపీ శాశ్వత కార్యవర్గ సభ్యుడు గౌతమ సామంతరాయ్, సీనియర్ నేత సుధాంసు శేఖర జెన, ప్రముఖ వ్యాపారి హిమాంసు మహాపాత్రో, ఇటీవల బీజేపీ తీర్థం పుచ్చుకున్న యువనేత రవీంద్ర మహాపాత్రోలు రేసులో ఉన్నారు. దీంతో టిక్కెట్టు ఎవరికి లభిస్తుందోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

ముగిసిన మానక్టిమ్మ జాతర



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



అమ్మవారి మేకుల పల్లకి



మీనా బజార్‌లో విద్యుత్ వెలుగులు

జిల్లా కేంద్రంలో జరుగుతున్న మానక్టిమా జాతర ఘనంగా ముగిసింది. చివరి రోజు మంగళవారం అమ్మవారిని దర్శించుకోవడం కోసం అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ముఖ్యంగా మేకుల పల్లకి ప్రత్యేక అకర్షణగా నిలిచించింది. భక్తులు భారీగా మొక్కులు చెల్లించుకున్నారు.

మల్కన్‌గిరి

దొండనచో దీక్షలు ప్రారంభం



గాంధీనగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



ఎండలో రోడ్డుపై దీక్షలు చేస్తున్న దృశ్యం



నృత్యం చేస్తున్న దీక్షధారులు

ప్రసిద్ధ చైత్రమాసం ఆరంభం కావడంతో జిల్లాలో దొండనచో దీక్షలు ప్రారంభమయ్యాయి. నగరంలోని గాంధీ నగర్, హరదాఖండి, సిటీ హాస్పిటల్ రోడ్డు, పాడు వీధుల్లో దొండనచో దీక్షాదారుల ప్రదర్శనలు జరిగాయి. సంప్రదాయం ప్రకారం మిట్ట మధ్యాహ్నం ఎండలో కఠోర ప్రద్శనలు చేపట్టారు. ఉపవాసాలతో ఉన్న దీక్షాధారులు సాయంత్రం స్నానం చేసిన అనంతరం ప్రసాద చేవనం చేస్తున్నారు. రాత్రి దొండకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, వివిధ రకాల సాంస్కృతిక నాటికల ప్రదర్శనలతో స్థానికులకు అకట్టుకుంటున్నారు.

బరంపురం

విద్యుత్ షాక్‌తో తాపీమేస్త్రీ మృతి



మందస: మందస మండలంలోని చిన్నసువర్ణాపురంలో మంగళవారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో సాలీన గున్నయ్య(43) అనే తాపీమేస్త్రీ మృతి చెందారు. ఇంటి పనులు చేస్తుండగా ఇనుప గజానికి విద్యుత్ ప్రసరణ జరిగింది. ఆ గజాన్ని పట్టుకోవడంతో ఆయన షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పలాస 108 అంబులెన్స్ సిబ్బంది బత్తిని తారకేశ్వరరావు, శ్రీనివాస్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరీక్షించి ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన వాడు కాగా, కొంతకాలంగా మందస మండలంలోని బహడపల్లి గ్రామంలో గల అత్తవారింట్లో నివాసం ఉంటున్నా రు. ఆయనకు భార్య గంగమ్మ, కుమారుడు, కుమా ర్తె ఉన్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు ఫీజుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ల పరీక్షల ఫీజుల స్వీకరణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. వర్సిటీలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఎటువంటి జరిమానా లేకుండా ఏప్రిల్ 4లోపు దరఖాస్తు చేసుకోవాలని, రూ.500 అదనపు రుసుముతో ఏప్రిల్ 6 వరకు, రూ.1500 అదనపు రుసుంతో ఏప్రిల్ 8 వరకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఎన్నికల నియమావళి, నిర్వహణ దృష్టిలో పెట్టుకొని పరీక్షల షెడ్యూల్ ఖరారు చేయనున్నట్లు తెలిపారు.

శ్రీకాకుళంలో జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ:

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈనెల 28వ తేదీన జాబ్‌మేళా జరగనుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలిపారు. నోడల్ రిసోర్స్ సెంటర్, జవహర్ నాలెడ్జ్ సెంటర్, కెమిస్ట్రీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్‌మేళాలో హెటిరో ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా సిటికల్ కంపెనీలో ట్రైనీ కెమిస్ట్ (ప్రొడక్షన్ క్యూసీ, ప్రొడక్షన్ క్యూఏ) ఉద్యోగాల భర్తీ కొరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు 27 ఏళ్లలోపు వయస్సు కలిగి ఎమ్మెస్సీ ఆర్గానిక్/ఇన్ ఆర్గానిక్/అనలేటికల్ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ ఉత్తర్ణులైన పురుషులు, మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైనవారికి మంచి జీతంతోపాటు ఈఎస్ఐ, ఈపీఎఫ్, మెడిక్లెయిమ్స్, రిటెన్షన్ బోనస్, సబ్సిడైజ్డ్ ఫుడ్, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు గురువారం ఉదయం కళాశాల జేకేసీ కేంద్రానికి తమ విద్యార్హత సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలతో ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ సురేఖ కోరారు. మరిన్ని వివరాలకు 9441387184, 9949094968, 8143277610 నంబర్లను సంప్రదించాలని ఆమె సూచించారు.

ఆర్మీ జవాన్ల విషాదాంతం

- ఒకరు రోడ్డు ప్రమాదంలో మృతి
- మరొకరు జమ్మూకాశ్మీర్‌లో ఆత్మహత్య
- శోకసంద్రంలో జీడిపుట్టుగ, మోదుగులపుట్టి గ్రామాలు



చైతన్య(ఫైల్)



ఘటనా స్థలంలో విగతజీవిగా చైతన్య

కాశీబుగ్గ : దేశరక్షణలో సేవలందిస్తున్న ఇద్దరు ఆర్మీ జవాన్లు వేర్వేరు కారణాలతో మృత్యువాతపడ్డారు. ఒకరు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సాయం కోసం వేడుకుంటూ హృదయ విదారకరంగా మృతి చెందగా.. మరొకరు తాను విధులు నిర్వహిస్తున్న చోటే ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు విడిచారు. దీంతో ఆయా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి.

లారీ కింద నలిగిపోయి..

సోంపేట మండలం జీడిపుట్టుగ గ్రామానికి చెందిన చెల్లూరి చైతన్య (28) ఇటీవల సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా ఎంపికయ్యాడు. శిక్షణ పూర్తి చేసుకుని సెలవు నిమిత్తం స్వగ్రామానికి వచ్చాడు. పలాసలో ఉంటున్న తన పెద్దమ్మను కలిసి ఆశీర్వాదం తీసుకునేందుకు మంగళవారం బైక్‌పై బయలుదేరాడు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కోసంగిపురం జాతీయ రహదారి వంతెన దిగువ ప్రాంతానికి వచ్చే సరికి ఇసుక లారీ ఢీకొట్టింది. చక్రాలమధ్య ఇరుక్కుపోవడంతో సగభాగం నుజ్జయిపోయి విలవిల్లాడాడు. తనను రక్షించాలని వేడుకున్నా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న 108 అంబులెన్సు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడ్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అధిక మొత్తంలో రక్తాన్ని కోల్పోవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చైతన్య మృతి చెందాడు. చైతన్య తండ్రి మరణించగా.. తల్లి కష్టపడి ఇద్దరు కుమారులను చదివించింది. మరో సోదరుడు తేజ చదువుతున్నాడు. చైతన్యకు ఉద్యోగం రావడంతో కుటుంబానికి పెద్ద దిక్కుగా మారాడు. ఇంతలోనే విధి కన్నెర్ర చేయడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్మీ జవాన్ ఆత్మహత్య..




మద్దిల జోగారావు (ఫైల్)

పలాస మండలం టెక్కలిపట్నం పంచాయతీ మోదుగులపుట్టి గ్రామం కొత్తవీధికి చెందిన మద్దిల జోగారావు (40) జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలోని ఉదంపూర్ యూనిట్‌లో జేసీఓ కేడర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి విధి నిర్వహణలో ఉండగా ఆత్మహత్య చేసుకున్నట్లు మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. జోగారావుకు తండ్రి ఇది వరకే మరణించారు. తల్లి ఆదెమ్మ, భార్య హేమాకుమారి, టెన్త్ చదువుతున్న కుమార్తె చాందిని, ఎనిమిదో తరగతి చదువుతున్న లక్ష్మీవరప్రసాద్‌లు గ్రామంలోనే ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియడం లేదు. జమ్మూ కాశ్మీర్ నుంచి బుధవారం సాయంత్రానికి మృతదేహం స్వగ్రామానికి చేరుకోనుందని సమాచారం.

ఘనంగా రాజశ్యామల హోమం

శ్రీకాకుళం కల్చరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర విజయవంతం కావాలని కోరుతూ రాజశ్యామల మూలమంత్ర సహిత దుర్గా సంపుటిత హోమం ఘనంగా జరిగింది. నగరంలోని రామలక్ష్మణ కూడలి వద్ద ఉన్న దుర్గామహాలక్ష్మీ దేవాలయంలో రాజశ్యామల మూలమంత్ర సహిత దుర్గా సంపుటిత హోమం ఆలయ ప్రధాన అర్చకులు తెన్నేటి సునీల్ శర్మ నిర్వహణలో మంళగవారం జరిగింది. ఈ సందర్భంగా కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ ప్రజలకు సీఎం వైఎస్ జగన్ అందించిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తామన్నారు. మేనిఫెస్టోలోని హామీలను 98.5 శాతం పూర్తి చేసిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. రానున్న ఐదేళ్ల ప్రణాళిక కూడా వివరిస్తామని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్న లోక్ సభ, శాసన సభ అభ్యర్థులకు ఈ యాగం ద్వారా ఉషస్సు, యశస్సు అందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, శ్రీశయన సంఘం కార్పొరేషన్ చైర్మన్ డీపీ దేవ్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, మాజీ వైస్ చైర్‌పర్సన్ చల్లా అలివేలు మంగ, అంబటి శ్రీనివాసరావు, సుంకరి కృష్ణ, చిట్టి జనార్దన్, కోణార్క్ శ్రీను, పొన్నాడ రుషి, మూకళ్ల తాతబాబు, అందవరపు సంతోష్, అందవరపు ప్రసాద్, బిర్లంగి రామ్మోహన్, మండవిల్లి రవి, మర్చంట్ నేటీ సాహుకారి నాగేశ్వరరావు, గుంట జ్యోతి, పడపాన సుగుణరెడ్డి, గంగు శారద, గుడ్ల మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



రాజశ్యామల హోమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి


పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్య నిర్వహణాధికారి డీవీవీ.ప్రసాదరావు నేతృత్వంలో ప్రధాన అర్చకుడు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో ఏనుగుల గుంపు


వెంకటరాజపురంలోని వరిచేలలో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం పంటపొలాల్లో మంగళవారం ఉదయం ఏనుగుల గుంపు సంచరించింది. సాయంత్రానికి చింతలబెలగాం, గవరమ్మపేట పంట పొలాల్లోకి జారుకున్నాయి. అరటి, జొన్న పంటల్లో కలియదిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. వారం రోజుల నుంచి ఇక్కడే ఉండి పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అటవీశాఖ సిబ్బంది వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

గడ్డివాములు దగ్ధం

బొండపల్లి: మండలంలోని జె.గుమడాం గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో కళ్లాల్లో ఉన్న గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామంలోని 9 మంది రైతులకు చెందిన 15 గడ్డి వాములకు పూర్తిగా మంటలు వ్యాపించి కాలిపోయినట్లు తహసీల్దార్ బీఎస్‌పీ హనుమంత రావు తెలిపారు. గ్రామానికి దూరంగా రైతుల కళ్లాలు ఉండడంతో అక్కడే వరి నూర్పులు చేసి రైతులు గడ్డి కుప్పలు పెట్టారు. గజపతినగరం అగ్నిమాపక వాహనం వచ్చేసరికి గడ్డి వాములు పూర్తిగా ఆహుతయ్యాయి. పక్కనే ఉన్న మరికొన్ని వాములుకు మంటలు వ్యాపించకుండా ట్యాంకర్లతో నీటిని తెచ్చి మంటలు అదుపు చేసినట్లు తెలిపారు. ప్రమాదంలో గడ్డి వాములతో పాటు, టేకు చెట్టు కొన్ని కాలిపోయాయని సుమారు లక్ష రుపాయలకు పైగానే నష్టం వాటిల్లినట్లు గుర్తించి నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించినట్లు తహసీల్దార్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకుడు మంత్రి గోవింద సందర్శించారు.

పాతబగ్గాంలో పూరిల్లు..

గజపతినగరం రూరల్: మండలంలోని పాతబగ్గాం ప్రధాన వీధిలో ఉన్న కుమిలి ఈశ్వరరావుకు చెందిన పూరిల్లు మంగళవారం కాలిపోయిందని గజపతినగరం అగ్నిమాపక అధికారి రాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. అప్పటికే ఇల్లు సగానికి పైగా కాలిపోవడంతో మూడు రోజుల క్రితం బ్యాంకు నుంచి తీసుకువచ్చిన డ్వాక్రా రుణం రూ.లక్షతో పాటు ఈశ్వరరావు కుమారులకు చెందిన డిగ్రీ సర్టిఫికెట్లు మంటల్లో కాలిపోయాయని తెలిపారు. నగదు, డబ్బుతో పాటు, వంట సామగ్రి కూడా దగ్ధమైనట్లు చెప్పారు. ప్రమాదానికి గల ప్రధాన కారణం ఇంట్లో దీపం వెలిగించి ఉండడంతో ఎలుక ఒత్తిని తీసుకుపోవడం వల్ల జరిగి ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

పాలకొండ రూరల్: మండలంలోని జి.వెంకటాపల్లి గ్రామానికి చెందిన కోమటిపల్లి మోహనరావు 20 లీటర్ల సారా తరలిస్తూ పాలకొండ ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్‌కు మంగళవారం పట్టుబడ్డాడు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా మద్యం, సారా అమ్మకాలు, తరలింపు చేస్తే కఠినమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సచివాలయ మహిళా పోలీసులు గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై, నేర చరిత్ర ఉన్నవారి కదలికలపై దృష్టి పెట్టాలని సూచించారు.

20 మద్యం బాటిల్స్ స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 20 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పెదమానాపురం ఎస్సై శిరీష మంగళవారం సాయంత్రం తెలిపారు.సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎక్కడా తగాదాలు రాకుండా గ్రామాల్లో మద్యం అమ్మకాలు చేపట్టరాదని ముందుగా అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఎవరైనా మద్యం తాగి గ్రామాల్లో అల్లర్లు సృష్టించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'ఇంతి'ంతై..!

వంటింటి కుందేలుగా మహిళలను ఇన్నాళ్లూ పరిగణించిన సమాజం ఇప్పుడు వారి స్వయం ఉపాధి, ఆర్థికోన్నతి చూస్తూ ఆశ్చర్యానికి లోనవుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ఆర్థిక తోడ్పాటుతో బయటకు వచ్చి చిన్నచిన్న వ్యాపారాలు నెలకొల్పి స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకుని కష్టపడి సంపాదిస్తూ ఆర్థికోన్నతి చెందుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మహిళలకు ప్రభుత్వం ద్వారా అందిన సాయంతో ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారి వివరాలిలా ఉన్నాయి.

- సర్కారు సాయంతో మహిళల స్వయం ఉపాధి
- జగనన్న తోడు ద్వారా 12,498మందికి లబ్ధి
- బ్యాంకు లింకేజీ ద్వారా రూ.947.94కోట్లు అందజేత
- వైఎస్సార్ చేయూత ద్వారా 2,76,511మందికి సాయం


టైలరింగ్ పనిలో బొంగు అనూష

మంచి అన్నదొరికాడు

మహిళలందరినీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నలా ఆదుకుంటున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో వచ్చిన రూ.35,700తో టైలరింగ్ పని ప్రారంభించాను. రూ.2వేల నా వంతు పెట్టుబడిగా పెట్టాను. వ్యాపారం ఆశాజనకంగా నడుస్తోంది. సకాలంలో రుణం చెల్లిస్తున్నాను. ప్రస్తుతం నెలవారీ రూ.6వేల నుంచి 8 వేల వరకు ఇంటివద్దనే ఉంటూ సంపాదిస్తున్నాను. జగనన్నకు ధన్యవాదాలు.
– బొంగు అనూష, చినబొండపల్లి, పార్వతీపురం మండలం

'మహిళలకు కొండంత అండ

మహిళలకు బ్యాంకు లింకేజీతో పాటు సున్నా వడ్డీ పథకం రాయితీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థికంగా కొండంత అండ నిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతోంది. పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ పథకా లన్నింటిలోనూ మహిళలను ప్రధాన లబ్ధిదారులుగా ఎంపిక చేసింది. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళాసాధికారత దిశగా అడుగులు వేయాలి.
–బోనెల పద్మ, గోపాలపురం


కూరగాయల వ్యాపారం చేస్తున్న బోనెల పద్మ

పార్వతీపురంటౌన్: మహిళల సంక్షేమానికి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. 'నవరత్నాలు' అమలులో భాగంగా మహిళలకు పెద్దపీట వేస్తోంది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తోంది. రుణాలను బ్యాంకుల నుంచి విరివిగా మంజూరు చేయిస్తోంది. నాలుగున్నరేళ్లుగా వివిధ పథకాల కింద ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కుటీర పరిశ్రమలు, కిరాణా దుకాణాలు, డెయిరీ ఫాంలు నిర్వహిస్తూ ఆర్థికోన్నతి చెందుతూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. జీవన ఉన్నతికి బాటలు వేసుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో మొత్తం 19,528 స్వయం సహాయక సంఘాల్లోని 2,25,667 మంది మహిళలకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందుతోంది.

'రూ.947.94 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుండగా, దీనికి బ్యాంకులు తోడ్పాటునందిస్తున్నాయి. బ్యాంకు లింకేజీ ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి స్వయం సహాయక సంఘాల పరిధిలో ఉన్న 2,60,500 మంది లబ్ధిదారులకు రుణ పంపిణీ లక్ష్యం కాగా, 2,48,419 మంది మహిళలకు రూ.947.94 కోట్ల మేర రుణాలను నేరుగా వారి గ్రూపు ఖాతాల్లో జమ చేశారు. స్త్రీనిధి పథకం కింద 16,496 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణ పంపిణీ లక్ష్యం కాగా 15,200 మందికి రూ.2.20 కోట్లు అందించారు.

పొదుపు మహిళల రుణ మాఫీ			
విడతలు	సంఘాలు	సభ్యులు	చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
మొదటి	16,695	1,92,694	11.05
రెండవ	18,868	2,15,165	10.66
మూడవ	20,223	2,30,676	13.68
నాల్గవ	20,223	2,34,256	23.18
'వైఎస్సార్ ఆసరా			
విడత	సంఘాల సంఖ్య	సభ్యుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
మొదటి	16,534	1,86,192	93.52
రెండవ	16,646	1,88,069	94.32
మూడవ	16,646	1,83,077	94.32
'చేయూత ద్వారా లబ్ధి(రూ.కోట్లలో)			
2020	61,498	120.80	
2021	75,290	115.29	
2022	64,433	177.25	
నాల్గవ విడత	2023	75,290	141.16

'సున్నా వడ్డీ భరోసా..

మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి ఆర్థిక భరోసా కల్పించేందుకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. జిల్లాలోని 2,24,589 మంది మహిళల ఖాతాల్లో రూ.30.50 కోట్ల మేర వడ్డీ రాయితీని జమ చేసింది. దిగువ, మధ్యతరగతి మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా బ్యాంకులతో పాటు మల్టీ నేషనల్ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుని వ్యాపారం, స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహిస్తోంది. క్రమం తప్పకుండా బ్యాంకు రుణాలు తీసుకున్న వారి వడ్డీ రాయితీని ప్రభుత్వమే భరిస్తోంది. అలాగే, వైఎస్సార్ ఆసరా పథకం కింద ఆర్థిక సహకారం అందించడంతో పాటు వ్యాపార రంగంలో రాణించేలా మెలకువలు నేర్పుతోంది. సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇప్పిస్తోంది. 45–60 ఏళ్ల మధ్య వయస్సు గల ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ నాలుగేళ్లలో రూ.75 వేలను ఉచితంగా అందిస్తోంది.


టైలరింగ్ షాపు పెట్టుకున్న ఝాన్సీలక్ష్మి

'మహిళలకు పెద్దపీట

మహిళలకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేం. కరోనా కష్టాల్లో గతంలో తీసుకున్న బ్యాంకు రుణాలు కట్టేందుకు ఇబ్బందులు పడ్డాం. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రుణాల వడ్డీని ప్రభుత్వమే భరిస్తోంది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.30వేలు లబ్ధిపొందాను. ఆ డబ్బుతో టైలరింగ్ షాపు పెట్టుకుని ఆర్థికంగా నిలదొక్కు కుంటున్నాను.
– ఝాన్సీలక్ష్మి, కృష్ణపల్లి

'ధవళ'కు వాగ్దేవి కళాయశస్వి పురస్కారం


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి

విజయనగరం టౌన్: ప్రముఖ సాహితీవేత్త, సేవాతత్పరుడు ధవళ సర్వేశ్వరరావుకు వాగ్దేవి కళాయశస్వి పురస్కారం అందజేయనున్నట్లు వాగ్దేవి సమారాధనం జై పైడిమాంబ వేద సంస్కృతాంధ్ర సంప్రదాయ పరిరక్షణ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక గురజాడ స్వగృహంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 9న ఉగాది రోజున వాగ్దేవి సమారాధనం సంస్థ నాలుగవ వార్షికోత్సవాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయం మేడపైన ఉన్న చా.సో భవనంలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సనాతన గురుకుల ఆశ్రమ పీఠాధిపతి బ్రహ్మశ్రీ యనమండ్ర వేణుగోపాల శాస్త్రి హాజరుకానున్నారని తెలిపారు. ఇటీవల కీర్తిశేషులైన సంస్థ కోశాధికారి దేవరాజు గోపాలకృష్ణ జ్ఞాపకార్థం ఆయన సేవలను గుర్తిస్తూ ప్రముఖ సాహితీవేత్త ధవళ సర్వేశ్వరరావుకు పురస్కారం అందజేస్తున్నామని తెలిపారు. ఆయనతో పాటు సంగీత, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాల్లో పేరెన్నికగన్న మరో 15 మందికి ఉప పురస్కారాలు ఉంటాయన్నారు. తనికెళ్ల వెంకట నాగ ప్రభాకర శాస్త్రి పంచాంగ శ్రవణం, 20 మందితో కవిసమ్మేళనం, చిన్నారుల నృత్యప్రదర్శన ఉంటాయన్నారు. అదే విధంగా ఏప్రిల్ 7వ తేదీన నామరామాయణం గోష్ఠి గానం పోటీలు గురజాడ స్వగృహంలో నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫోన్ 8790607303 నంబర్‌ను సంప్రదించి పేర్లను నమోదుచేసుకోవాలని కోరారు. ఉగాది రోజున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కార్యక్రమాలు ఉంటాయని, అభిమానులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షులు పీవీఎల్.సుబ్బారావు, భోగరాజు సూర్యలక్ష్మి, గౌరవ అధ్యక్షులు ముళ్లపూడి సుభద్రాదేవి, గురజాడ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 25 మంది వలస

- చింతాడ గ్రామానికి చెందిన వ్యక్తుల చేరిక


పార్టీకండువా కప్పి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్, జెడ్పీటీసీ గొర్లె సరయు

జామి: మండలంలో వైఎస్సార్‌సీపీలోకి వలసలు ప్రారంభమయ్యాయి.చింతాడ గ్రామం నుంచి టీడీపీ చెందిన 25 మంది మంగళవారం ఆ పార్టీని వీడి వైస్సార్‌సీపీలో చేరారు. గ్రామ సర్పంచ్ అప్పాన సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ అమరవిల్లి అప్పలనాయుడుతో పాటు మరికొందరు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, జెడ్పీటీసీ గొర్లె సరయు సమక్షంలో జామి మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ రవికుమార్, జెడ్పీటీసీ సరయు వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని తెలిపారు. అనంతరం మండల కన్వీనర్ రవికుమార్ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కడుబండి శ్రీనివాసరావును, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ముందుంటే నిబంధన వర్తించదు

- కలెక్టర్ నాగలక్ష్మి




విజయనగరం అర్బన్: ఎన్నికల కోడ్ అమలులోకి రాక ముందు లబ్ధిదారుల వద్దనున్న పాస్ పుస్తకాలపైన లేదా ఏ ఇతర లబ్ధిదారు కార్డులపైన ఉన్న ప్రభుత్వ లోగోలు, ముఖ్యమంత్రి ఫొటోలు ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు రావని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. అదే విధంగా కోడ్ రాక ముందు వేసిన శిలా ఫలకాలు, సర్వే రాళ్లకు కూడా కోడ్ వర్తించదని స్పష్టం చేశారు. మోడల్ కోడ్ అమలు అధికారులు కోడ్‌లోని అంశాలను క్షుణ్ణంగా చదవాలని సూచించారు. ప్రతిరోజూ పత్రికలలో సర్వే రాళ్లపై ముఖ్యమంత్రి పేరు ఉందని, కోడ్ ఉల్లంఘన జరుగుతోందని వచ్చే వార్తలపై కలెక్టర్ స్పందించారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలకు గడువు పెంపు

విజయనగరం అర్బన్: ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న అనాథలు, హెచ్‌ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలు ప్రైవేట్ స్కూల్స్‌లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం పొందడానికి ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ ఎస్.ప్రేమకుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా విద్యార్థుల నివాసానికి సమీపంలో ఉన్న అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెంట్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం కోటా కింద ఉచిత ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ఆసక్తిగల వారు వెబ్‌సైట్ లేదా దగ్గరలోని సచివాలయం/ఇంటర్నెట్, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం/మీ సేవా కేంద్రాల్లో కూడా ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయం పనివేళల్లో సంప్రదించవచ్చని సూచించారు.

తోటపల్లితో ఊరట


తోటపల్లి జలాశయం పరిధిలో లైనింగ్ పనులు పూర్తయిన ఎడమ ప్రధాన కాలువ


ఎడమకాలువపై ఎం.రాజపురం వద్ద నూతనంగా నిర్మించిన వంతెన

- ఆయకట్టుకు జీవం పోసిన సీఎం జగన్ మోహన్ రెడ్డి
- ఐదేళ్లుగా పాత ఆయకట్టుకు పుష్కలంగా నీరు పంపిణీ
- వాస్తవాలను పక్కన పెట్టి ఈనాడు తప్పుడురాతలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జలవనరులశాఖ అధికారులు

వీరఘట్టం: ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల రైతుల ఆశల సౌధం తోటపల్లి జలాశయం. ఈ జలాశయంలోని పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనులపై గత టీడీపీ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపకపోవడంతో టీడీపీ పాలనలో రైతులు తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొన్నారు. 2019లో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేస్తూ పాత ఆయకట్టు ఆధునికీకరణ పనులకు జీవం పోశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో గత ఐదు ఖరీఫ్ సీజన్లలో ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రణాళికాబద్ధంగా నీటి పంపిణీ చేస్తున్నారు. అంతేకాకుండా ఓ పక్క కాలువల ఆధునికీకరణ పనులు చేపడుతూనే మరో పక్క సాగునీటి పంపిణీ చేస్తూ సాగును సస్యశ్యామం చేశారు. అంతేకాకుండా గత టీడీపీ పాలనలో అరకొరగా చేపట్టిన పనులకు కూడా సుమారు రూ.13 కోట్ల బిల్లులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించింది. అయితే వాస్తవ పరిస్థితులను విస్మరిస్తూ తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులపై 'అయిదేళ్లూ చాల్లేదా' అనే విషపు కథనాన్ని మంగళవారం 'ఈనాడు' పత్రిక ప్రచురించింది.

చేపట్టిన పనులు కనిపించలేదా..?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులను ఐదేళ్లుగా ప్రణాళికా బద్ధంగా చేపడుతూ, మరో వైపు ఖరీఫ్‌లో పుష్కలంగా సాగునీరందించిన విషయాలు ఈనాడుకు కనిపించకపోవడం శోచనీయమని రైతులు అంటున్నారు. 37.536 కి.మీలు పొడవున్న ఎడమకాలువలో ఇంతవరకు 16.843 కి.మీ వరకు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి.అలాగే 17.616 కి.మీ పొడవున్న కుడికాలువలో 9.376 కి.మీ వరకు కాంక్రీట్ పనులు చేపట్టారు. మొత్తం 55.152 కి.మీలకు గాను ఇంత వరకు 26.919 కి.మీ అంటే సుమారు 45 శాతం పనులు చేపట్టారు. అంతేకాకుండా ఎడమకాలువలో అచ్చపువలస వద్ద,6వ బ్రాంచ్ వద్ద, ఎం.రాజపురం వద్ద, కత్తులకవిటి వద్ద వెడల్పయిన వంతెనలు నిర్మించి వాహన రాకపోకలకు మార్గం సుగమం చేశారు. నీటి పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా గత ఖరీఫ్‌లో చర్యలు చేపట్టి శివారు వరకు సాగునీరందించారు. ఒక పక్క ఆధునికీకరణ పనులు చేపడుతూ మరో పక్క గత ఐదు ఖరీఫ్ సీజన్లలో సకాలంలో కాలువలకు సాగునీరందిస్తూ ప్రభుత్వం తోటపల్లి ఆయకట్టును సస్యశ్యామలం చేస్తుంటే తోటపల్లి కాలువ పనులపై ఈనాడు తప్పుడు వార్తలు రాస్తుండడం ఎంత వరకు సమంజసమని జలవనరులశాఖ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

గత టీడీపీ పాలన అంతా కరువే...

గత టీడీపీ పాలనలో తోటపల్లి ఆయకట్టు రైతులు తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొన్నారు మరి ఆ విషయాలను ఎందుకు ఈనాడు రాయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. 2014లో టీడీపీ అధికారం చేపట్టిన ఏడాదే అక్టోబర్ 8 నుంచి 14 వరకు హుదూద్ తుఫాన్ విలయ తాండవం చేస్తూ వరి పంటకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది.ఈ తుఫాన్‌లో పంటలు నష్టపోయిన నిజమైన రైతులను విస్మరించి టీడీపీ నాయకులు వారి బినామీల పేర్లు నమోదు చేసి పంటల నష్ట పరిహారాన్ని స్వాహా చేశారు. అలాగే 2015లో నవంబర్‌లో చాప్లా తుఫాన్ ప్రభావంతో పంటలకు నష్టం కలిగింది. మరుసటి ఏడాది 2016 ఆగస్టు 18న తోటపల్లి ఎడమకాలువలో పెద్దబుడ్డిడి వద్ద ఉన్న బ్రిటిష్ కట్టడం సైఫన్ కు భారీగా గండిపడింది. దీంతో సైఫన్‌కు దిగువన ఉన్న 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు ప్రశ్నార్థకంగా మారడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అలాగే 2017 ఖరీఫ్‌లో ఫణి తుఫాన్ పంటలను అతలాకుతం చేసింది. 2018లో అక్టోబర్ 8 నుంచి 12 వరకు సంభవించిన తిత్లీ తుఫాన్ ధాటికి పంటలు సమూలంగా నేలమట్టమయ్యాయి. ఇలా 2014 నుంచి 2018 వరకు చంద్రబాబు పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా కరువు ఏర్పడడంతో పాటు తోటపల్లి పాత ఆయకట్టు రైతులు కూడా తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణకు చంద్రబాబు ప్రభుత్వం ముందుకు రాలేదు. 2019లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తోటపల్లి కాలువలకు ఆదరాబాదరాగా నిధులు మంజూరు చేసి వీరఘట్టం మండలం అచ్చెపువలస వద్ద శంకుస్థాపన పనులు చేట్టి రైతులను మోసగించే ప్రయత్నం చేసింది. గత టీడీపీ పాలనతో విసిగిన రైతులు 2019లో టీడీపీకి బుద్ధి చెప్పి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారు.


మహదేవివలస-గోపాలపురం మధ్యలో పూర్తయిన ఎడమకాలువ కాంక్రీట్ లైనింగ్ పనులు

ఏర్పాట్లు కట్టుదిట్టం

- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ప్రచారానికి 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలి
- కలెక్టర్ నిషాంత్ కుమార్

సాక్షి, పార్వతీపురం మన్యం: సభలైనా, ర్యాలీలైనా, డోర్ టు డోర్ ప్రచారమైనా త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రచారంలో పాల్గొనే అభ్యర్థులు నిబంధనల ప్రకారం కనీసం 48 గంటల ముందుగా అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిషాంత్‌కుమార్ వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను, ఇప్పటివరకు చేపట్టిన ప్రక్రియను మంగళవారం ఆయన ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌తో కలసి కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరించారు. ఈ నెల 16న ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని..అప్పటి నుంచి ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని చెప్పారు. ఏప్రిల్ 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, అదే నెల 29వ తేదీ వరకు విత్‌డ్రాకు అవకాశం ఉందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందని, జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ చేపట్టామని తెలిపారు.

144 సెక్టార్లు..151 రూట్లు

జిల్లాలో 1031 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని.. అక్కడ తాగునీరు, ఫ్యాన్లు, ర్యాంపులు, లైట్లు, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే అధికారులు పలు మార్లు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారని తెలిపారు. పాలకొండ, కురుపాం ప్రాంతాల్లోని కొన్ని సమస్యలున్న కేంద్రాలను గుర్తించామని..అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 144 సెక్టార్లు, 151 రూట్లు ఏర్పాటు చేశామని, ఈవీఎంలు సరిపడా ఉన్నాయని తెలిపారు. 48 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 36 ఎస్ఎస్‌టీ బృందాలు, 16 వీఎస్‌టీ బృందాలను నియమించామని వివరించారు. నియోజకవర్గ స్థాయిలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను పాలకొండ, కురుపాం, పార్వతీపురంల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ..సాలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ ఏర్పాటు చేశామని వివరించారు. నాలుగు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రం పార్వతీపురం ఉద్యాన కళాశాలలో ఉంటున్నారు. అరకు పార్లమెంట్ రిటర్నింగ్ అధికారిగా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌ను నియమించారని చెప్పారు. అరకు పార్లమెంట్ లెక్కింపు ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ఉంటుందన్నారు.

కొఠియా గ్రామాల్లో ఓటర్లకు స్వేచ్ఛ

కొఠియా గ్రామాల్లో తమకు నచ్చినచోట ఓటు వేసే స్వేచ్ఛను ఓటర్లకు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇటీవలే కొరాపుట్, రాయగడ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశమయ్యామై పలు అంశాలపై చర్చించామని తెలిపారు. ఇందులో కొఠియా అంశం ఒకటని, శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించామన్నారు. మనవైపు నుంచి కొన్ని పోలింగ్ కేంద్రాలు, ఒడిశా నుంచి కూడా ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ఓటరు తన ఇష్ట ప్రకారం కేంద్రానికి వెళ్లి ఓటు వేసుకోవచ్చని..ఏ జిల్లా యంత్రాంగమూ అడ్డుకోదని స్పష్టం చేశారు.

ఫిర్యాదులపై తక్షణ చర్యలు

జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు 161 ఫిర్యాదులు అందాయని కలెక్టర్ నిషాంత్ కుమార్ వివరించారు. వాటిలో సీ విజిల్‌కు సంబంధించి 20, 1950 టోల్ ఫ్రీ నంబరుకు 15, మీడియా ద్వారా 39 ఎన్నికల ఫిర్యాదుల పోర్టల్‌లో 71, ఇతర ఫిర్యాదులు 16 ఉన్నాయని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను సరాసరి 38 నిమిషాల్లో పరిష్కరించామని చెప్పారు.

సంయుక్త దాడులు

ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత జిల్లాలో 7,134 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ రూ.28.84 లక్షలుగా పేర్కొన్నారు. పార్వతీపురం, కొమరాడ, ఒడిశా పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారని చెప్పారు.

చెక్‌పోస్టుల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా నిఘా

అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. అంతర్రాష్ట్ర సరిహద్దులో ములిగూడ, బత్తిలి, భామిని, పి.కోనవలస, కూనేరు కూడళ్లలో ఇప్పటికే చెక్‌పోస్టులు పని చేస్తున్నాయన్నారు. వాటన్నింటిలో వెబ్‌కాస్టింగ్ పెట్టి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని వివరించారు. ఇవి కాక మరో ఐదు చెక్‌పోస్టులు గుణుపూర్, పద్మాపూర్, దండిగాం, ఆర్‌కే బట్టివలస, అడారు వద్ద ఏర్పాటు చేస్తున్నామన్నారు.

భద్రతాపరమైన చర్యలు:ఎస్పీ

ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు భద్రతాపరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని వివరించారు. ఇప్పటికే మూడు కంపెనీల సీఆర్పీఎఫ్ బలగాలు వచ్చాయన్నారు. వివిధ ప్రాంతాల్లో ప్రతి రోజూ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు పాల్గొన్నారు.